

5 నుంచి డ్రైవర్లకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవర్లకు ఈ నెల 5 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 13 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. 14వ బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లాలో ఏకైక గవర్నమెంట్ డ్రైవింగ్ స్కూల్ ఆర్‌టిసి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ అనంతరం ధ్రువపత్రాలను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9963091999, 7989723505 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

సామూహిక గృహ ప్రవేశాలు షురూ

- 5న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ
- జిల్లాలో 26,970 ఇళ్లు ప్రారంభం
- జలుమూరులో ప్రారంభించనున్న మంత్రి ధర్మాన
- యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5న సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని గతంలో అనేకసార్లు తేదీలు ప్రకటించినప్పటికీ రకరకాల కారణాలతో వాయిదా పడుతూ వచ్చాయి. ఈ సారి ఎలాగైనా కార్యక్రమం చేసి తీరాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చివరి దశకు వచ్చాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోటలో ఆ రోజున ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అదేరోజున రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు జలుమూరు మండలం లింగాలవలస లేఅవుట్‌లోని గృహాలను ప్రారంభించనున్నారు. తొలి రోజు ప్రారంభించనున్న గృహాలకు విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పనకు సంబంధించి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు.



జలుమూరు మండలం లింగాలవలస లేఅవుట్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న జగనన్న ఇళ్లు (ఇన్‌సెట్‌లో రంగులు వేస్తున్న కార్మికులు)

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో నవరతాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసింది. వీటిని వివిధ దశల్లో చేపడుతూ 2024 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీటిలో తొలుత ఈ నెల ఐదో 26,970 మందితో గృహప్రవేశాలు ప్రారంభించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్లు పూర్తయినట్లు లెక్కలు చెప్తున్నా లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన అంతమాత్రంగానే ఉంది. సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న ఇళ్లకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కొంత వరకు బాగానే కల్పించినా... జగనన్న లేఅవుట్లలో మాత్రం తీవ్ర వెనుకబాటు కనిపిస్తోంది. జిల్లాకు నిర్దేశించిన 26,970 గాను ఇప్పటివరకు 24,773 ఇళ్లకు తాగునీరందించినట్లు అధికారులు చెప్తున్నారు. అదేవిధంగా విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి 25,182 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. నీటి సరఫరాకు సంబంధించి మూడు మండలాల్లో మాత్రమే పూర్తి స్థాయిలో తాగునీటి కనెక్షన్లు ఇచ్చారు. గృహప్రవేశాలకు సిద్ధమవుతున్న 26,970 గాను, ఇంకా 1788 ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించలేదు.

అరకొరగానే మౌలిక వసతులు

శ్రీకాకుళం అర్బన్ ప్రాంతంలో 875 ఇళ్లను ప్రారంభించాల్సి ఉండగా, ఇప్పటివరకు 510 ఇళ్లకు తాగునీటి సౌకర్యం, 324 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. సోంపేటలో 945 ఇళ్లను ప్రారంభోత్స వానికి సిద్ధం చేస్తుండగా, వాటిలో 363 ఇళ్లకు తాగునీరు, 188 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. ఇచ్ఛాపురం మండలంలో 632 ఇళ్లలో ప్రవేశాలు జరపాలని నిర్ణయించగా, 181 ఇళ్లకు తాగునీరు, 177 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. జలుమూరులో 1104 ఇళ్లను ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తుండగా, వాటిలో 145 ఇళ్లకు తాగునీరు, 60 ఇళ్లకు విద్యుత్ సరఫరా సమకూర్చలేదు. ఇచ్ఛాపురం అర్బన్‌లో 962 ఇళ్లకు గాను, 125 ఇళ్లకు తాగునీటి కనెక్షన్లు, 128 ఇళ్లకు విద్యుత్ సౌకర్యం అందించ లేదు. పలాస-కాశీబుగ్గలో 795 ఇళ్లను ప్రవేశాలకు సిద్ధం చేస్తుండగా, 209 గృహాలకు తాగునీరు, 24 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు సమకూర్చలేదు. ఆమదాలవలస అర్బన్‌లో పరిస్థితి కొంత బాగానే ఉంది. 761 ఇళ్లలో ప్రవేశాలు చేయాలని నిర్ణయించగా, 8 ఇళ్లకు తాగునీరు, పది ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయలేదు.

ఐదు పర్యాయాలు వాయిదా

సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం ఇప్పటివరకు ఐదు పర్యాయాలు వాయిదా పడ్డాయి. 2022లో విజయదశమి రోజున నిర్వహిస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజైన డిసెంబరు 21 చేపడతామని నిర్ణయించింది. గృహ నిర్మాణాల లక్ష్యం కనీసం సగం కూడా పూర్తికాకపోవడంతో వాయిదా వేసింది. ఈ ఏడాది మార్చి 22న ఉగాది సందర్భంగా అందరితో గృహ ప్రవేశాలు జరుపుతా యమని తెలిపింది. ఆగస్టు 30న ప్రారంభించేందుకు తేదీ ఇచ్చారు. అనివార్య కారణాల వల్ల ఆ తేదీ వాయిదా పడింది. ఎన్నికలు సమీపిస్తుండటంతో జిల్లాల్లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం... అందులో భాగంగానే సామూహిక ఇళ్లనూ ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

డిసెంబరు నాటికి మరో 18,700 ఇళ్లు

వచ్చే ఏడాది ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మరో 18,700 ఇళ్లను సామూహిక గృహ ప్రవేశాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఇందుకోసం జిల్లాల వారిగా లక్ష్యాలను నిర్దేశించింది. ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని సూచించినట్లు తెలిసింది.



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మహాత్ముని సేవలు మరువలేనివి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అహింసే ఆయుధంగా దేశానికి స్వతంత్రం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని, ఆయన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. గాంధీ 154వ జయంత్యుత్సవాలు సందర్భంగా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన ద్వారా గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా గాంధీ కలలు కన్నారని అన్నారు. ఆయన ఆశయ సాధనలో ప్రతిఒక్కరూ దేశం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అలాగే లాల్ బహదూర్ శాస్త్రి రైతులకు అందించిన సేవలను గుర్తుచేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనింగ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలు మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి భారతీయులకు స్వేచ్ఛనిచ్చిన మహావ్యక్తి గాంధీజీ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు,, హెచ్.సెక్షన్ శ్రీకాంత్, బి.సెక్షన్ సురేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న రజనీకాంతారావు

ఆకట్టుకున్న బాపూజీ ఏకపాత్రాభినయం

గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా తాడివలస ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి బాపూజీ జీవితచరిత్రను ఏకపాత్రాభినయంగా ప్రదర్శించారు. గాంధీజీ ఆశయాలు, ఆలోచనలను భావితరాలకు అందించే విధంగా చక్కగా ఆ విద్యార్థి చేసిన ఏకపాత్రాభినయం ఆహుతులను ఆకట్టుకుంది. కమిషనర్ ఓబులేసు, విశ్రాంత జెసి రజనీకాంతరావు ఆ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, వావిలాపల్లి జగన్నాథంనాయుడు, ఎం.ప్రసాదరావు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, నటుకుల మోహన్, బాడాన దేవభూషణం, హరికాప్రసాద్, నిక్కు అప్పన్న, చింతాడ కృష్ణమోహన్, ముని శ్రీనివాసరావు, పందిరి అప్పారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ జి.ఎస్.రామారావు పాల్గొన్నారు.

జిల్లాలో ఎన్‌ఐఎ కలకలం

- ఏడుచోట్ల సోదాలు
- కరపత్రాలు, సాహిత్యం స్వాధీనం
- 25న హైదరాబాద్‌కు రావాలని నోటీసులు జారీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్, పలాస, వజ్రపుకొత్తూరు, టెక్కలి రూరల్

జిల్లాలో సోమవారం పలుచోట్ల జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) సోదాలు నిర్వహిస్తుందన్న వార్తలు కలకలం రేపాయి. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్న పౌర హక్కులు, ప్రజా సంఘాలు, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ నాయకుల ఇళ్లల్లో దర్యాప్తు సంస్థ అధికారులు తనిఖీలు జరిపారు. పోలీస్ బందోబస్తుతో అధికారులు రావడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. తనిఖీలు ముగిసే వరకూ ఇళ్ల వద్ద సాయుధ పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. సోదాల్లో భాగంగా కొన్ని పుస్తకాలు, సాహిత్యం, కరపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 25న హైదరాబాద్ నేషనల్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయానికి హాజరుకావాలని అందరికీ నోటీసులు జారీ చేశారు.

శ్రీకాకుళం జిలా కేంద్రం శివారుల్లో ఉన్న ముచ్చువానిపేటలో నివాస ముంటున్న కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉపాధ్యాయుడు మిస్క కృష్ణయ్య, బొందిలీపురంలో నివాస ముంటున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు, న్యాయవాది కిలారు ఈశ్వరరావు, పాండురంగ వీధిలో నివాస ముంటున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు కె.వి.జగన్నాథరావు ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఇళ్లల్లో కేంద్ర బలగాలకు చెందిన సిబ్బందితో కలిసి ఈ సోదాలు చేపట్టారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి దేశవ్యాప్త నిషిద్ధ సంస్థగా ఉన్న సిపిఐ మావోయిస్టు పార్టీతో సంబంధాలు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో ఈ సోదాలు జరిపారు. మానవ హక్కుల వేదిక నాయకులు జగన్నాథరావు ఇంట్లో జరిపిన సోదాల్లో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో వెనుదిరిగారు. మిగిలిన చోట్ల కరపత్రాలు, సాహిత్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. ఎన్‌ఐఎ అధికారులు వారి సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. వారిని విచారించిన అనంతరం ఈనెల 2న హైదరాబాద్‌లో ఉన్న ఎన్‌ఐఎ ప్రాంతీయ కార్యాలయంలో హాజరు కమ్మని లిఖితపూర్వకమైన నోటీసులు అందజేశారు.



పలాస : మాకన్నపల్లిలో వీరస్వామి ఇంటి వద్ద ఎన్‌ఐఎ అధికారులు

పలాస మండలం మాకన్నపల్లికి చెందిన పౌరహక్కుల నేత సాలిన వీరాస్వామి ఇంట్లో ఎన్‌ఐఎ అధికారుల బృందం సోదాలు నిర్వహించారు. వీరి సోదాల్లో ఉపా కరపత్రాలు మాత్రమే లభ్యం కావడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పౌరహక్కుల నేత సాలిన వీరాస్వామి మాట్లాడుతూ తాను సాధారణ రైతు కూలీనని, తన ఇంట్లో ఎన్‌ఐఎ అధికారులు సోదాలు చేయడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి, గడూరు గ్రామాల్లోని అమరవీరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులు ఇళ్లల్లోనూ ఎన్‌ఐఎ బృందాలు సోదాలు నిర్వహించారు. ఉదయం ఆరుగంటలకు అక్కుపల్లికి చెందిన బంధుమిత్రులు కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మడ్డు ధనలక్ష్మి, మరో రాష్ట్ర సభ్యులు గడూరుకు చెందిన జోగి కోదండరావు ఇళ్లకు చేరుకున్నారు. ఇద్దరు ఇళ్లల్లోనూ నాలుగు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వివిధ సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ఉదయం ఆరు గంటలకు వజ్రపుకొత్తూరు పోలీసుల సహకారంతో వీరు ఇళ్లకు ఒకే సమయంలో చేరుకున్నారు. ఒక్కసారిగా పోలీసులు బృందాలు గ్రామాలకు రావడంతో గ్రామస్తులు సైతం ఆందోళనలు చెందారు. అక్కుపల్లి మడ్డు ధనలక్ష్మి ఇంటికి చేరుకున్న సమయానికి ఆమె అనారోగ్యంతో మంచంపై పడుకొని ఉన్నారు. బృందం సభ్యులు ఇంట్లోకి వచ్చి పరిచయం చేసుకొని తనిఖీలు చేస్తామని చెప్పి సోదాలు ప్రారంబించారు. ఇంటిలో ఉన్న బీరువాలు, అన్ని గదులు, మంచాలు, చివరకు వంట సామగ్రినీ తనిఖీలు చేపట్టారు. ఇంట్లో ఉన్న పుస్తకాలు పరిశీలించారు. అందులోని దండకారణ్యం, మై తుజే సలాం. నజ్సలబరి, శబ్దం, ప్రజాకళలు మొత్తం ఐదు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. జోగి కోదండరావు ఇంటి నుంచీ కొన్ని పుస్తకాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం తాము స్వాధీనం చేసుకున్న పుస్తకాల వివరాలకు సంబంధించి రసీదులు అందించారు. అమరవీరుల బంధుమిత్రుల కమిటీ కార్యకలాలపై పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు.

టెక్కలి మండలం తొలుసూరుపల్లి పంచాయతీ మున్సబ్‌పేటలో కులనిర్మూలన పోరట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు ఇంట్లో ఎన్‌ఐఎ సోదాలు నిర్వహించారు. ఈ సోదాలో కుల నిర్మూలన పోరాట సమితి బ్యానరు, లెటర్ ప్యాడ్, సెల్‌ఫోన్, దళితులు తరుపున ఫిర్యాదు చేసిన దరఖాస్తులు సీజ్ చేసినట్లు సమాచారం. అయితే ఇటీవలన అంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభాకరరావు అరెస్టు చేయడం పాఠకులకు విదితమే. ఏమైనా మావోయిస్టులతో సత్సంబంధాలు ఉన్నాయని అనుమానంతో ఈ సోదాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ నెల 25న హైదరాబాద్ నేషనల్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయానికి హాజరుకావాలని నోటీసులు ఇచ్చారని ప్రభాకరరావు తెలిపారు.

ఆందోళన చెందా

ఉదయం ఆరు గంటకే పోలీసు బృందాలు ఇంటికి రావడంతో ఆందోళనకు గురయ్యాం. తాను సుగర్, బిపి లాంటి దీర్ఘకాలి వాధులతో బాధపడుతున్నాను. ఒక్కసారిగా ఎన్‌ఐఎ బృందన సభ్యులు ఇంట్లోకి ప్రవేశించి ఇంటిలో శోదాలు చేస్తామని చెప్పడంతో తాము అందకు అంగీకరించాం. సోదాలు చేసి ప్రచురణ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. అందులో ఏ ఒక్క పుస్తకమూ నిషేధిత పుస్తకం కాదన్నారు. తన భర్త మడ్డు ధనరాజు బూటకు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. నా భర్త మృతదేహాన్ని చివసారిగా చూడలేకపోయాను. ఇలాంటి బాధలు మరే ఒక్కరు పడకూడదనే తాము అమరవీరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర సభ్యులుగా పనిచేస్తున్నాను.

- మడ్డు ధనలక్ష్మి, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర సభ్యులు, పలాస



పాదయాత్రలో పాల్గొన్న రవికుమార్

చంద్రబాబు అరెస్టు సైకో పాలనకు నిదర్శనం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ సిఎం చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు సైకో పాలనకు నిదర్శనమని టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ అన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేపట్టి దీక్షకు సంఘీభావంతో సోమవారం నిర్వహించిన సత్యమేవ జయతే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షకు మాజీ సైనికులు సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. ముందుగా గాంధీ జయంతిని పురస్కరించుకొని వన్ వే కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని చూస్తేనే సిఎం జగన్మోహన్‌రెడ్డి ఉలిక్కి పడుతున్నారని ఎద్దేవా చేశారు. నేడు ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తున్నారని అన్నారు. అక్రమ కేసులతో, అరెస్టులతో టిడిపి నాయకులు భయపడేది లేదని హెచ్చరించారు.

నవరత్నాల పేరిట సంక్షేమ పథకాల పేరుతో జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అన్యాయం ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ఒక చేత్తో రూ.వంద ఇచ్చినట్టే ఇచ్చి... మరో చేత్తో రూ.వెయ్యి ప్రజల నుంచి దోచుకుంటున్న వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో ప్రజలు వైసిపికి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.ః గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూశామని, ఇంత ఘోరమైన పరిపాలన చేస్తున్న ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మాజీ సైనికుల విశ్రాంతి భవనానికి 10 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తామని వారికి హామీనిచ్చారు. దీక్ష ముగిసిన అనంతరం గాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, బూర్జ జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఆనెపు రామకష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, కూన సత్యారావు, శివ్వాల సూర్యం, పల్లి సురేష్, అంబళ్ల రాంబాబు, కిల్లి సిద్ధార్థ, తమ్మినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతగా సిక్కోలు క్రీడాకారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం స్పోర్ట్స్

సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచినట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోత పూర్ణచంద్రరావు, పి.వి.జి.కృష్ణంరాజు స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా నందాల (మహానంది దేవస్థానం మైదానం) వేదికగా సెప్టెంబరు 30, అక్టోబరు 1, 2వ తేదీల్లో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో రాణించారు. 60 ఏళ్ల బాల్ బ్యాడ్మింటన్‌లో చరిత్రలో శ్రీకాకుళం క్రీడాకారులు తొలిసారి రాష్ట్రస్థాయిలో విజయదుందుబి మోగించినట్లు చెప్పారు. విజేతలకు మహానంది దేవాలయం ట్రస్టు చైర్మన్ కొమ్మ మహేశ్వరరెడ్డి, ఇఒ కాపు చంద్రశేఖర్రెడ్డి, నిర్వాహుకులు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా క్రీడాకారులకు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.అజయ్కుమార్, కోచ్, మేనేజర్లు యానాల తారకేశ్వరరావు, ఎం.మధుసూదనరావు, కోశాధికారి బి.హెచ్ అరుణ్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు సూర శ్రీనివాసరావు, నదుకుదిటి ఈశ్వరరావు, గొండు శకంర్, రుప్ప రమణమూర్తి, నరసింహనాయుడు, తదితరులు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు

నలుగురికి స్టార్ ఆఫ్ ఆంధ్రా అవార్డులు

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన నలుగురు జిల్లా క్రీడాకారులకు స్టార్ ఆఫ్ ఆంధ్రా అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బాల్‌బాడ్మింటన్ సంఘం ప్రతినిధులు క్రీడాకారులకు అవార్డులను, ప్రశంశాపత్రాలను అందజేశారు. జిల్లా నుంచి బాలికల విభాగంగా ముంత గాయత్రి (ఎచ్చెర్ల), సింగూరు నందిని (ఎచ్చెర్ల), బాలుర విభాగంలో శిష్టు హిమత్ కుమార్ (కేశవరావుపేట), లబ్బ మణికంఠ (నరసన్నపేట) స్టార్ ఆంధ్రా అవార్డులు అందుకున్నారు. ఈ నలుగురు క్రీడాకారులతో పాటు నర్సీపురం ప్రవీణ్ కుమార్ జాతీయస్థాయి పోటీలకు స్టాండ్ బైగా ఎంపికైనట్లు ఎపి బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్‌రెడ్డి, రావు వెంకటరావు, కోశాధికారి బి.హెచ్.ఆదినారాయణ, చీఫ్ రిఫరీ ఎన్.వి.ఎన్.రాజులు ప్రకటించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో జరగనున్న శిక్షణ శిబిరంలో తర్ఫీదు పొందుతారు. అక్టోబరు 17 నుంచి 19వ తేదీ వరకు చత్తీషఘడ్ బిలాయ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రా తరుపున జిల్లా నుంచి పాల్గొనున్నారు.

'కొఠారి' సిఫార్సులతోనే అందరికీ విద్య

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కొఠారి సిఫార్సుల అమలుతోనే అందరికీ విద్య సాధ్యమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మాజీ యుటిఎఫ్ నాయకులు కొత్తకోట రామలక్ష్మి 5వ సంస్మరణ సభ సందర్భంగా సోమవారం స్మారకోపన్యాసం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజ్యాంగం-విద్య అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు విజయ గౌరిలతో కలిసి పాల్గొన్నారు. ముందుగా రామలక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం 21వ నిబంధనలో బాలకార్మికవ్యవస్థ ఉండకూడదని, 29వ నిబంధనలలో విద్య అందరికీ సమానంగా అందించాలని, 21-ఎ నిబంధనల ప్రకారం విద్య ప్రాథమిక హక్కుగా మార్చారని అన్నారు. కానీ, రాజ్యాంగ లక్ష్యాలను ప్రస్తుత పాలకులు నెరవేర్చడం లేదన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత 1948లో రాధాకృష్ణన్ కమిషన్, 1956లో మొదలియార్ కమిషన్, 1966లో కొఠారి కమిషన్, 1986లో నూతన జాతీయ విద్యావిధానాన్ని కేంద్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయని తెలిపారు. వీటిలో విద్యారంగాన్ని కాపాడు కునేందుకు వీలుగా కొఠారి కమిషన్ తప్ప అన్ని కమిషన్లనూ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కొఠారి కమిషన్ చెప్పిన కామన్ స్కూల్, విద్యను ప్రభుత్వ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు 30 శాతం కేటాయించాలన్నారు. జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించేలా ప్రభుత్వానికి న్యాయస్థానాలు సూచించాయని అన్నారు. కొఠారి కమిషన్ సలహాలను అమలు చేయకుండా అందరికీ విద్య అందించడం, సమాజంలో ఉన్న అంతరాలను రూపుమాపడం సాధ్యం కాదన్నారు పాలకవర్గాలకు ఉపయోగపడే విద్యా కమిషన్లు అమలు చేస్తున్న ప్రభుత్వాలు ప్రజలందరికీ ఉపయోగపడే కొఠారి కమిషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలవుతున్న జాతీయ విద్యా విధానం-2020 రాజ్యంగ లక్ష్యాలను నెరవేర్చే విధంగా లేదన్నారు. ప్రజలకు సంపూర్ణ విద్యనందించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. విద్య కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ, మతతత్వీకరణ వైపు మారే విధంగా నూతన విద్యా విధానం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా లక్ష్యాలకు దూరంగా ఉన్న జాతీయవిద్యా విధానం-20ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరంతరం అధ్యయనం చేస్తూ... విద్య అందరికీ ప్రభుత్వం అందించే విధంగా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్య, సామాజిక మార్పునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రశ్న, చైతన్యం విద్య నుంచి అలవడాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య నేర్పడం లక్ష్యంగా పనిచేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ రామలక్ష్మి మహిళా ఉపాధ్యాయులను ఉద్యమం వైపు ఆకర్షించడానికి తపన పడేవారిని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, రెడ్డి మోహనరావు మాట్లాడుతూ విద్య ప్రభుత్వ బాధ్యత అని, కానీ, ప్రభుత్వం విద్య మార్కెట్ శక్తులకు వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధిలో కీలకమైన నిర్మాణంలో రామలక్ష్మి పాత్ర అమోఘమని, ఆమె స్ఫూర్తితో మహిళలు ఉద్యమంలోకి రావాలని కోరారు. అనంతరం స్ఫూర్త పెన్షన్ విధానం ఈ సంస్మరణ సభలో కవితల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎం.వాగ్దేవి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు, సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శులు జి.సూర్యప్రకాశరావు, జి.సురేష్, పి.వసుందరాదేవి, బి.శారద, ప్రజా సంఘాల నాయకులు పి.తేజేశ్వరరావు, చింతాడ రామారావు, వి.జె.కె.మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం


పలాస : గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి అప్పలరాజు


పొందూరు: పిచ్చి మొక్కలను తొలగిస్తున్న జడ్జి జ్యోత్స్న


ఎచ్చెర్ల : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ట్రిపుల్ ఐటి విద్యార్థులు


కవిటి: నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు


రణస్థలం రూరల్: మొక్కను నాటుతున్న ఎన్ఇఆర్

ప్రజాశక్తి- పలాస

జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దామని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో గాంధీ విగ్రహానికి సోమవారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, హనుమంతు వెంకటరావు మాష్టారు, వైస్ చైర్మన్ మీసాల సురేష్, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీశంకర్, విప్ దుర్గా శంకర్ పాండా, వాణిజ్య విభాగం అధ్యక్షులు బెల్లాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యం...

కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో గాంధీ విగ్రహానికి మాజీ మున్సిపల్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, వడ్డే యాదగిరి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, నవీన్, నర్సింహులు, అలాగే పలాస ప్రభుత్వాస్పత్రిలో అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైద్యులు చిన్నంనాయుడు, కూర్మారావు, అశ్విని, గీతారాణి, కిరణ్ పాల్గొన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వప్పు, ఎంపిటిసి తంగాని రవణమ్మ, అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ కాశీబుగ్గ స్మార్ట్ పాఠశాలలో కరస్పాండెంట్ ఎ.వి.కె.శాస్త్రి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మామిడి, కొబ్బరి, మందారం మొక్కలను మైదానంలో నాటారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ ఆర్. హేమచలం, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలి పురి అప్పారావు, పాఠశాల స్టాఫ్ లాభాల రమేష్ పాల్గొన్నారు. అలాగే బిజెపి నాయకులు పాలవలస వైకుంఠరావు, అమ్మ ఆశ్రమం వ్యవస్థాపకులు రామానంద స్వామిజీ, జిల్లా ఉపాధ్యక్షులు కొర్రాయి బాలకృష్ణలు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఆమదాలవలస : యువత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడవాలని డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. వన్ ఊడలి కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సనపల అన్నాజీరావు, లఖినేని నారాయణరావు, బసవ షణ్ముఖరావు, పప్పల రమణ, లఖినేని సాయిరాం, కూన సుందరరావు, బొత్స రవణ, గురుగుబెల్లి కృష్ణమూర్తి, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, దాలయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దమడి రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి తూర్పు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపిలు ఎస్.ఆదినాయుడు, వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు ఎఎంసి మాజీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పెద్దింటి చందరరావు, గణేష్ ప్రధాన్, జనపరెడ్డి కన్నబాబు పాల్గొన్నారు.

నందిగాం : నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని గాంధీ విగ్రహానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు లొట్టిబొగారావు యాదవ్, మండల జెసిఎస్ కన్వీనర్ జద్మాడ జయరాం పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

శ్రీకాకుళం అర్బన్ : డిసిసిబి కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి అధ్యక్షులు కరిమి రాజేశ్వరరావు, సిఇఒ డి.వరప్రసాద్, జి.ఎం.డి.ఎస్.జగదీష్, ఎచ్చెర్లలోని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ఆచార్య జగదీశ్వరరావు, ఒఎస్‌డి ఎల్.డి.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకాడమిక్ డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సల్లా అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు, పిఇఒ డాక్టర్ రాజేటి శ్రీనివాసరావు, డాక్టర్ వి.సింహాచలం, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఈశ్వరరావు, తేజేకిరణ్, అలాగే డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ డాక్టర్ శ్రీనివాస పాత్రో, చలమయ్య, నగరంలోని గాంధీ మందిరంలోని గాంధీ విగ్రహానికి నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, విశాలాక్షి జెసి ఎం.నవీన్ గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ మేడూరి ప్రసాదరావు ఆధ్వర్యాన చిన్నారులు వేసిన గాంధీ వేషధారణతో యూత్ క్లబ్ భవనం నుంచి గాంధీ మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భోగిల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పాతబస్ స్టాండ్ వద్ద ఉన్న నేత్ర సేకరణ కేంద్రంలో రెడ్‌క్రాస్ అందిస్తున్న ఉచిత వైద్యసేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేష్ సూచించారు. సోమవారం రెడ్‌క్రాస్ వైద్య సేవల కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో సోమవారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవల్లో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పి.ఎల్.ఎన్ రాజు, డాక్టర్ దినేష్ కాంత్ ఉడయాన, దంతవైద్య నిపుణులు డాక్టర్ ప్రేమ్ సక్కారి, కుటుంబ వైద్య నిపుణులు డాక్టర్ కెల్లి చినబాబు, జనరల్ ఫిజీషియన్ లైఫ్ ఆస్పత్రి వైద్యులు ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ పి.రామకృష్ణ, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.వెంకట రాజేష్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ కె.లక్ష్మణమూర్తి సేవలు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.సుధీర్, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కవిటి: త్యాగధనుల సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు కవిటి మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసి దుద్ది సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కవిటి సచివాలయం-1లో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, బొరివంక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఎం.ఇ.ఒ ధనుంజయ మజ్జి, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ శ్రీరాం ప్రసాద్, హెచ్.ఎం ఎస్.రామకష్ణ, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, కవిటి ఎస్‌విజె విద్యా సంస్థల్లో కరస్పాండెంట్ బెండాలం కింగ్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు పులమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఎచ్చెర్ల: మండలంలోని ధర్మవరం గ్రామంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి నిర్వాహకులు టేకి ఆచారి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, యువకులు మరియు విద్యార్థిని విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాన్న రాంబాబు, ఎంపిటిసి ప్రతినిధి రుప్ప రమేష్, ఉపాధ్యాయులు రఘునాధ్, ఎం.జయరాం, అరసవల్లి వెంకట రమణ, కునుకు వాసుదేవరావు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఎస్.సంధ్యకు ప్రథమ, బి.రాముకు ద్వితీయ, ఎస్.ప్రసాద్‌కు తతీయ స్థానాలు వచ్చాయి. గ్రంథాలయం తరుపున వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి. గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, భారతరత్న మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ చిత్రపటాలకు సోమవారం ఎంపిడిఒ కార్యాలయంల ఎఒ బసవ రాంబాబు,ఎసిఒ.ప్రేమలత, సిబ్బంది నివాళ్లర్పించారు.

టెక్కలి రూరల్: భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కలిగించి దేశ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అందించిన జాతిపిత మహాత్మా గాంధీ మహనీయుడని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గొండెలి సుజాత అధ్వర్యంలో గాంధీ విగ్రహం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఇటీవల శాసన మండలి ప్రివిలైజ్, కమిటీ మెంబెర్‌గా ఎన్నిక అయినా సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో వైయస్ఆర్ సిపి జిల్లా మహిళా పార్టీ అధ్యక్షులు చింతాడ మంజు, ఎంపిటిసిలు, సర్పంచులు, వార్డు సభ్యులు, ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఎంపిపి అట్లా సరోజనమ్మ మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు నివాళ్లర్పించారు.

బూర్జ: మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లోనూ, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద మహాత్మా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు.

ఇచ్ఛాపురం: గాంధీ జయంతి పురస్కరించుకొని సోమవారం ఇచ్ఛాపురం పట్టణంలో మున్సిపల్ గాంధీ పార్కులో గాంధీ విగ్రహానికి ముందుగా నివాళి అర్పించి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కాళ్ల జయదేవ్, ఢిల్లీరావు, పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్ కుమార్, సహదేవ్ రెడ్డి, లీలారాణి, కోటి, కొండ శంకర్ రెడ్డి, నందిక జాని, పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేట గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల మహిళా అధ్యక్షులు గురాన మానస చిరంజీవి ముందుగా గాంధీ విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. అనంతరం పారిశధ్య కార్మికులను సన్మానించారు. ఈకార్యక్రమంలో సచివాలయం కన్వీనర్‌లు మహంతి సత్యనారాయణ, గడి సత్యం, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, గురాన చిరంజీవి, గడి రమణ, గురాన బంగారినాయుడు, పిల్ల వాసుదేవరావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణంలో సోమవారం జూనియర్ సివిల్ జడ్జి బి. జ్యోత్స్న ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ ఆవశ్యకతను తెలియజేస్తూ కోర్టు ఆవరణంలో గల పిచ్చి మొక్కలను చెత్తాచెదారాలను తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటిడెంట్ సత్యనారాయణ, న్యాయవాదులు కె.రమణమూర్తి, బ్రహ్మాజీ, కిరణ్, అశోక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పతివాడపాలెం సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి పతివాడ సత్యం అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం గ్రామంలో ఉన్న పిల్లల కోనేరు గట్టుపై బాదం, వేప, మామిడి, కొబ్బరి తదితర సుమారు 100 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు బొంతు జగన్నాధం, రెడ్డి తవిటినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక గాంధీ పార్క్ ప్రాంగణంలో మహాత్మా గాంధీ విగ్రహానికి చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మెన్ దుక్క లోకేష్ రెడ్డి, వైసిపి పట్టణ ప్రెసిడెంట్ ప్రకాష్ పట్నాయక్, కౌన్సిలర్లు మధుమూర్తి, బచ్చు జగన్, నీలాపు లక్ష్మీ, జగన్నాయకులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, టెక్కలి మున్సిప్ మెజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి మల్లా తేజ చక్రవర్తి, బోప్పాయిపురం పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ గుజ్జుమోహన్‌రెడ్డి, పాత నౌపడాలో సర్పంచ్ దల్లి లోకేశ్వరరెడ్డి, నర్సింగపల్లిలో సర్పంచ్ రౌతు జయమోహన్, బి.ఎస్.జె,ఆర్ డిగ్రీ కళాశాలలో కరస్పాడెంట్ డాక్టర్ కోత మురళీధర్, ప్రణవి కళాశాలలో కరస్పాడెంట్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, టెక్కలి గ్రంథాలయంలో బి.రూపావతి, టిడిపి కార్యాలయంలో ఆధ్యక్షులు బగాది శేషగిరి, జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ కణితి కిరణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు, బిజెపి కార్యాలయంలో హనుమంతు ఉదయ్‌భాస్కర్, కంద్రవీధిలోని గాంధీ విగ్రహం వద్ద బిజెపి నాయకులు జన్ని పరమేశ్వరరావు, ఒక్లాండ్ ఆంతర్జాతీయ పాఠశాలలో ప్రిన్సిపల్ మల్లా మధులత, రవీంద్రభారతి పాఠశాలలో ప్రిన్సిపల్ పద్మజ, చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం. ఆనూరాధ, మండల రీసోర్సు కేంద్రంలో మండల విద్యాశాఖాధి కారులు దల్లి తులసిరావురెడ్డి, దాసుపురం చిన్నారావుల ఆధ్వర్యంలో గాంధీజయంతి వేడుకలు నిర్వహించారు.

రణస్థలం రూరల్: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న గాంధీ విగ్రహానికి జిల్లా పార్టీ అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) వినతి పత్రాన్ని అందించారు.

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ అవరణలో గాంధీ విగ్రాహానికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుంద్రరాజు, వైఎస్ ఎంపిపి తర్ర రామక్రిష్ణ, పార్టీ సీనియర్ నాయకులు పేడాడ వెంకటరావు, స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావు, మండల బూత్ కమిటీ ఇంచార్జ్ వినోద్, ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, పంకు రాము, మెట్ట సింహాచలం, తర్ర రమణారావు, నేతింటి సింహాచలం, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే హరిశ్చంద్రపురం టీడీపీ మహిళ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ పూజారి శైలజా సత్యనారాయణ ఉన్నత పాఠశాల ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్.రాంకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి మండల టిడిపి అధ్యక్షుడు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోరాడ పెద్ద గోవింద్, చిన్న గోవింద్, దేవాది సింహాద్రి, బోయిన సత్య శ్రీనివాస్, బోయిన రిత్విక్ ఉన్నారు. స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి గాంధీవాధి రఘుప్రాతుని వసంతకుమార్ పూలమాలలు వేసి విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.

సంత బొమ్మాళి: జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మ, పాల తలగాంలో సర్పంచ్ నక్కిట్ల అప్పన్న ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు లండ రామారావు, పంచాయతీ కార్యదర్శి కె.రాజేంద్ర ప్రసాద్, విఆర్‌ఒ.పి.రమణ పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు మండలం తోలాపి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం మహాత్మ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలను వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీడీసీ పప్పల అప్పలనాయుడు, ప్రధానోపాధ్యాయులు వి.సత్యరాజ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్: స్థానిక బ్యాంకర్స్ కాలనీలో సాయి ప్రియదర్శిని ఎడ్యుకేషనల్ సొసైటీ, విశాఖ స్కూల్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. గాంధీ చిత్రపటానికి స్కూల్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ ఆధ్వర్యంలో బాపూజీ గాంధీజీ జయంతిని, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు దేశ నాయకుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు.

ప్రజలకు అండగా జనసేన


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న రామ్మోహనరావు

ఆమదాలవలస : ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని దూసిపేట గ్రామంలో జనసేన పార్టీ మండల నాయకుడు మురపాక రాజశేఖర్ (మైఖేల్) ఆధ్వర్యంలో జెమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పేద ప్రజల పక్షాన జనసేన పార్టీ ఉంటుందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 373 మంది రోగులు, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సీనియర్ నాయకులు పాత్రుని పాపారావు, సరుబుజ్జిలి మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్, గంగు కోటేష్, పొట్నూరు ప్రసాద్, గురుగుబెల్లి అశోక్, దువ్వాడ కరుణాసాగర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలో ఎంఎల్ఆర్ నాయుడు డిగ్రీ కళాశాల ఆవరణలో డాక్టర్ ముద్దాడ బాల భూపాల నాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష, మరియు రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ధర్మాన కృష్ణదాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలు అందించడంలో ఎంఎల్ఆర్ నాయుడు డిగ్రీ కళాశాల యాజమాన్యం ముందుంటుందని అన్నారు. అలాగే ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం చేకూర్చుటకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. అలాగే రక్తదానం చేసేవారికి అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 600 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 30 మంది యువకులు రక్తదానం చేశారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జడ్‌పిటిసి ప్రతినిధి చింతు రామారావు, సర్పంచ్ బి. శంకర్, విశ్రాంతి ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతి ఫ్రెడరిక్, కళాశాల ప్రిన్సిపల్ వి.శాంతారావు, వైద్యులు ఎం.ప్రదీప్, ఎస్ సింధు, టి.శ్రవ్య, ఎ.మల్లేష్, సిహెచ్ నారాయణ రావు, బి.శంకరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

దేశవ్యాప్తంగా జర్నలిస్టుల భద్రత కోసం మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని పాత్రికేయుడు బొడ్డేపల్లి మోహనరావు డిమాండ్ చేశారు. ఐజెయు పిలుపుమేరకు గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని వన్‌వే కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో మీడియా విస్తృతి పెరిగిందని, సోషల్ మీడియా కూడా ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు. ప్రపంచంలో పాకిస్తాన్ కన్నా భారత దేశంలో మీడియా స్వేచ్ఛ స్థాయి దిగజారి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కోసం ఉన్న ఒకే ఒక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, కార్మిక శాఖలో విలీనం చేసిందని అన్నారు. కానీ, నేటి వరకు మార్గదర్శక సూత్రాలు తయార కాలేదని అన్నారు. జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం అవసరమని అన్నారు. దీన్ని రూపొందించడానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు అన్నెపు రమేష్, సనపల చంద్రశేఖర్, దుప్పల శ్రీనివాసరావు, అన్నెపు మోహనరావు, దవళ శ్రీనివాసరావు, హరీష్ పాల్గొన్నారు.

పలాస : జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని సీనియర్ జర్నలిస్టు డి. మహారణ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

శ్రీకాకుళం నగరంలోని చేపట్టిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, సింగుపురం మాజీ ఎంపిటిసి పంగ మహాలక్ష్మి, సానివాడ సర్పంచ్ రుప్ప లక్ష్మి, కల్లేపల్లి మాజీ సర్పంచ్ ముకళ్ల శ్రీదేవి, జెడ్‌పిటిసి మాజీ గొండు ధాత్రిజ పాల్గొన్నారు. సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చి వారి హక్కులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హరిస్తున్నారని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం విడుదల చేసే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే పంచాయతీ అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీనాయుడు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనేపు రామకృష్ణ, మదుపం సర్పంచ్ అప్పలనాయుడు, సానివాడ సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

ఆమదాలవలస మండలం కొర్లకోటలో సర్పంచ్ సనపల అన్నపూర్ణమ్మ ఆధ్వర్యాన టిడిపి నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యాన మండలంలోని బ్రాహ్మణతర్లలో విద్యుత్ బల్బులను ఆపి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, బి.నాగరాజు, వడ్డే యాదగిరి, ఆళ్ల వెంకటరావు, ఎర్ర శిమ్మయ్య, గరికె కృష్ణారావు, చల్ల విశ్వనాథం, బత్తల.సూర్యం, కోరాడ జోగారావు, వడ్డి కూర్మారావు, ఢిల్లి ధర్మారావు పాల్గొన్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారంతో 20 రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, విఠల్‌రావు, లొడగల కామేష్, గాలి కృష్ణారావు, గోరకల వసంత స్వామి, బడ్డ నాగరాజు, నవీన్, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం వద్ద దీక్ష, అనంతరం పాతబస్టాండ్ గాంధీ విగ్రహం వరకు బైక్‌పై వచ్చి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం నల్లబార్జీలు ధరించి, గాంధీజీ చిత్రపటాలు పట్టుకొని నిరసన తెలిపారు. విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, బోయిన గోవిందరాజులు, హరివరప్రసాద్, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం రాత్రి కవిటి బస్టాండులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, బెందాలం రమేష్, కొర్రాయి వాసుదేవ్, బెందాలం విజయ్, బాసుదేవ్‌రౌలో, సంతోష్ పట్నాయక్, మణి చంద్రప్రకాష్, పుల్లట రాజు, పుల్లట సంతోష్, బార్ల చినబాబు, ఆరింగి రాజు పాల్గొన్నారు.

రణస్థలంలో సత్యమేవ జయతే దీక్షకు సంఘీభావంగా టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు దీక్షలో పాల్గొన్నారు.


ఉప్పివలసలో విజృంభిస్తున్న డయేరియా

ప్రజాశక్తి- రణస్థలం


రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు రజిత

మండలంలో ఉప్పివలస గ్రామంలో గత నాలుగు రోజులుగా డయేరియా విజృంభించి సుమారుగా 40 మంది వరకు డయేరియా భారిన పడ్డారు. ప్రస్తుతం తగ్గుముఖం పడుతుంది. రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రజిత ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా వైద్య సేవలు అందిస్తున్నారు. సోమవారం వైద్యాధికారిణి రజిత స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో కుళాయిల పైపులు లీకేజీ వల్ల తాగునీరు కలుషితమవుతున్నాయని చెప్పారు.. అలాగే పారిశుధ్య పనులు కూడా చేయడం లేదని, . నాలుగు రోజుల క్రితం వినాయక చవితి సందర్భంగా గ్రామంలో అన్నసంతర్పన కార్యక్రమం జరిగిందని ఆరోజు వంటలు కలుషితమైన నీరుతో చేయడంతో గ్రామంలో కొంత మంది డయేరియా భారినపడ్డారని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు కుళాయిల పైపులు లీకేజీలు గుర్తించి పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం డయేరియా అదుపులోకి తీసుకురావడం జరిగిందని రోగులకు ఇంటి వద్దే సెలాయిన్లు పెట్టి మందులు ఇవ్వడం జరిగిందని, తగ్గుముఖం పట్టనివారని కొండములగాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి పంపించి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అలాగే ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందితో ఇంటింటి సర్వే చేయించామని తెలిపారు.

వైసిపి ఎమ్మెల్యే రేసులో డాక్టర్ శివాజీ


శివాజీ

సోంపేట : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రధాన శివాజీ వైసిపి ఎమ్మెల్యే రేసులో ఉన్నట్లు సమాచారం. ఈయన గత 30 సంవత్సరాలుగా సోంపేట, బారువ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విశేష సేవలు అందించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లో ఇటు ప్రజలతోనూ అటు రాజకీయంగా పరిచయాలు ఉన్న వ్యక్తి. ఈయనకు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గంలో మంచి గుర్తింపు ఉంది. డాక్టర్‌గా పనిచేస్తున్న శివాజీ వాలంటీర్‌గా రిటైర్మెంట్ తీసుకున్నారు. వైసిపి నాయకత్వం అవకాశం ఇస్తే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అర్హత కలిగిన వ్యక్తి. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి ఎమ్మెల్యే టికెట్ కోరుతూ వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణలకు ఆయన కలిసినట్లు సమాచారం.

ప్రమాదాలు నివారణకు విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ

పలాస : విద్యుత్ ప్రమాదాలు నివారణకు సిఎండి ఆదేశాల మేరకు పలాస సబ్ స్టేషన్ కు చెందిన విద్యుత్ ఉద్యోగులు పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉందన్నారు. డిఇ కృష్ణమూర్తి, నాగభూషణం, గిరీశ్వరరావు, హరిబాబు, గంగాధర్ పాల్గొన్నారు.

ఎడ్ల బండిపై నుంచి జారిపడి రైతు మృతి

ప్రజాశక్తి- లావేరు

అప్పటి వరకు కుటుంబ సభ్యులుతో సరదాగా గడిపి మంగళవారం గ్రామంలో గ్రామదేవత పండుగ జరగనుందని ఇంట్లో బియ్యం లేకపోవడంతో ధాన్యాన్ని మిల్లు ఆడించడానికి తన ఎద్దులు బండితో వెళ్లి ప్రమాదవశాత్తు ఆ బండి కింద పడి అక్కడక్కడే మృతి చెందిన ఘటన లావేరు మండలంలోని చిన్నకొత్తకోటలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు, కుటుంబ సభ్యులు వివరాలు మేరకు చిన్న కొత్తకోట గ్రామానికి చెందిన ఎర్రబోలు దుర్గారావు(57) తన ఇంట్లో ధాన్యాన్ని మిల్లు ఆడించడానికి సోమవారం తన ఎడ్లు బండిపై ధాన్యం బస్తాలు వేసుకొని పాతకుంకం గ్రామంలోని మిల్లుకు వెళ్లారు. అక్కడ ధాన్యాన్ని ఆడించి తిరుగు ప్రయాణమై వస్తుండగా ఎద్దులు బండి చక్రం రహదారి గుంతలో పడటంతో ఒక్కసారిగా బండి పైనున్న రైతు దుర్గారావు బండి చక్రం క్రింద పడడంతో మెడపై నుండి చక్రం వెళ్లి పోవడంతో అక్కడకక్కడే రక్తం కారుతూ మతి చెందారు. అక్కడి గ్రామస్తులు చూసి కుటుంబీకులకు తెలియ చేశారు. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు బోరున విలపించారు. మంగళవారం గ్రామ దేవత వారాలు చేసుకొనేటందుకు గ్రామస్తులు కుటుంబీకులు తలమునకలై ఉన్న సమయంలో ఈ ఘోరం జరగటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య ఈశ్వరమ్మ, ముగ్గురు కుమారులు శ్రీధర్, సత్యనారాయణ, దాలయ్య ఉన్నారు. విషయం తెలుసుకున్న లావేరు పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని శవపంచనామ చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కె. కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో నర్సింగపల్లి గ్రామానికి చెందిన పోలాకి మన్మధరావు(62) సోమవారం గడ్డిమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవలు పడుతుండగా సోమవారం కూడా మద్యం సేవించడంతో ఇంట్లో కుటుంబసభ్యులతో చిన్నపాటి వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న గడ్డిమందును సేవించి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు. కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్. రామక్రిష్ణ తెలిపారు.

బావిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో ఉన్న బావిలో జారిపడి పతివాడ సింహాచలం (22) మృతి చెందినట్లు సోమవారం ఎస్ఐ లక్ష్మణరావు మృతుడు వేకువ జామున ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. గ్రామంలో వెతకగా కోనేటి చెరువు సమీపంలో గల బావి వద్ద చెప్పులు కనిపించాయన్నారు. అనుమానం వచ్చి గ్రాముఉలు నూతిలో వెతకడంతో మృతదేహం లభించిందన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా రెండు రోజులుగా మద్యం మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారని అన్నారు. మృతుడు స్థానికంగా ఉన్న స్టోన్ క్రషర్‌లో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడని అన్నారు. మృతుడి తండ్రి కొంతకాలం క్రితం మృతి చెందగా, తల్లి చిన్నమ్మడు ఉన్నారని చెప్పారు. దీనిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎరువులు అందించడంలో అధికారులు విఫలం


నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- బూర్జ

రైతులంటే అధికారులకు ఇంత చులకన భావన ఉంటుందా, రైతుల సమస్యలను పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని అప్పలపేట సర్పంచ్ కొరికాన వెంకట సీతారామరాజు ప్రశ్నించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు రైతులకు అవసరమైన ఎరువులు, డిఏపి అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు కొరత పూర్తిగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలకు ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద కొనుగోలు చేయవలసిన దుస్థితి వచ్చిందన్నారు. అధికారులు విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జల జీవన మిషన్ పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తామని, గ్రామాల్లో ఇరువైపులా రహదారులను తవ్వేసి విడిచి పెట్టారని, ఇంతవరకు అధికారులు తాగునీరు సరఫరా చేయలేదని గుత్తావల్లి గ్రామ సర్పంచ్ హనుమంతు గోపి నిలదీశారు. అధికారులు రోడ్లు తవ్వేసి విడిచిపెట్టడం వలన రాత్రి సమయంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, తాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారా లేదా అని నిలదీశారు. మండలంలోని టిడిపి గ్రామ సర్పంచ్‌లకు తెలియజేయకుండా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని పలువురు సర్పంచులు లేవనెత్తారు. అలాగే మండలంలో ప్రస్తుతం మూగజీవాలకు లంపి వ్యాధి సోకి మూగజీవాలు మత్యువాత పడుతున్నాయని, అయితే పశు వైద్యాధికారులు అందుబాటులో ఉండకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు సభ్యులు తెలిపారు. కనీసం మూగజీవాలకు వ్యాధి నివారణకు అవసరమైన వ్యాక్సిన్ కూడా అందుబాటులో లేకపోవడం శోచనీయమన్నారు. పాడి రైతులు తీవ్ర నష్టాలు చూడాల్సి వస్తుందన్నారు. అలాగే మండలంలో అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడం వలన నేటికీ అద్దె కొంపల్లో నిర్వహిస్తున్నారన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు పక్కాభవనాలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. ఎంపిపి కర్నేన దీప అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జడ్‌పిటిసి బి.రామారావు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కె. గోవిందరావు, బుడుమూరు సూర్యారావు, కరణం కష్ణమనాయుడుతో పాటు ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, వావిలపల్లి రాజేశ్వరరావు, ఎపిఎం బాబురావు, ఎపిఒ రాజ్‌కుమార్‌తో పాటు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సిఎం

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం గ్రామ సచివాలయంలో. స్వాతంత్ర సమరయోధులు, జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం ఆధ్వర్యాన గ్రామ సచివాలయాలు వ్యవస్థ ప్రారంభాన్ని పురస్కరించుకుని 'థాంక్యూ సిఎం సార్' పేరుతో సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించి లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు.

మంత్రికి సన్మానం

పలాస: పలాస ప్రగతి భవన్‌లో పలాస ఎపి ఎన్‌జిఒ సంఘం నాయకులు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు సోమవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ సందర్భంగా సన్మానం చేసినట్టు ఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడు బోనెల గోపాల్ తెలిపారు. కార్యక్రమంలో పలాస ఎంపిడిఒలు రమేష్ నాయుడు, తిరుమలరావు, ఈశ్వరమ్మ, ఎన్‌జిఒ వైస్ ప్రెసిడెంట్ పి శ్రీనివాసరావు, ఉదయ శంకర్ పాత్రో, పూజారి శివ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, మున్సిపాలిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం: మండలం కొలిగం పంచాయతీలో జిఎంజీ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు సోమవారం ఎంపిపి బోర పుష్ప భూమి పూజ నిర్వహించారు. ముందుగా గాంధీజీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చెయ్యాలని, ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సర్పంచ్ సంతోష్, మాజీ ఎంపిపి మోహనరావు, దేవరాజు. దీనబంధు, గుండు బెహరా, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

టైర్ల మన్నికకు మరింత శ్రద్ధ

శ్రీకాకుళం అర్బన్ : ఆర్‌టిసి పరిధిలో టైరు సంరక్షణకు డ్రైవర్లు మరింత శ్రద్ధ చూపాలని రెండో డిపో మేనేజర్ రవి శంకరశర్మ పిలుపు నిచ్చారు. డిపో పరిధిలోని గ్యారేజీ ఆవరణలో సిబ్బందికి టైర్ల మన్నికపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్సులు సక్రమంగా నడవడానికి టైర్లు ఎంతో కీలకమని, వాటిలో వారానికి రెండుసార్లు తప్పక గాలిని నింపాల్సిన బాధ్యత గ్యారేజీ సిబ్బందిపై ఉందని అన్నారు. రోజూ టైర్లలో ఇరుక్కున్న రాళ్లు తొలగించాలన్నారు. డ్రైవర్లు సడన్ బ్రేకులు వేయకుండా వాహనాన్ని నడపాలని సూచించారు. టైర్లు పంక్చర్లను గమనించిన వెంటనే మరో టైరును మార్చుకోవాలని సూచించారు. రోడ్డు కండిషన్ బట్టి బస్సులకు తగిన టైర్స్ వేసి నడపాలన్నారు. టైర్ల సంరక్షణకు జాగ్రత్తలు పాటించడం వల్ల వాటి జీవిత కాలం మెరుగు పడుతుందన్నారు.

సాధనతోనే సత్ప్రవర్తన

శ్రీకాకుళం అర్బన్ : ఖైదీలను సంస్కరించే ప్రదేశాలను కారాగారాలుగా భావించడం సరికాదని, వాటిని ఆశ్రమాలుగా భావించాలని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం అంపోలులో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో సోమవారం ఖైదీల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ తనను తాను సంస్కరించుకోవడం ఎంతో కష్టసాధ్యమని అన్నారు. ఎంతో సాధన చేయడం వల్ల సత్ప్రవర్తన సాధ్యమవుతుందని అన్నారు. మనుషుల ప్రవర్తనను నియంత్రించుకొని సన్మార్గంలో నడవడానికి మంచి అవకాశంగా భావించి జైలు జీవనంలో తమను సంస్కరించుకోవాలన్నారు. క్షణికావేశాలకు పోకుండా కుటుంబం గురించి ఆలోచించాలన్నారు. మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ఆలోచనాశక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కారాగారం సూపరింటెండెంట్ నబీ ఖాన్, డిప్యూటీ జైలర్ దివాకర్‌నాయుడు డాక్టర్ బ్రహ్మం జైలు సిబ్బంది మెడికల్ స్టాఫ్ పాల్గొన్నారు. అనంతరం ఖైదీలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

కూరగాయల్లో ఎటిఎం మోడల్

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలం గ్రామంలో పెద్దింటి రాజేశ్వరికి చెందిన 15 సెంట్లు పొలంలో కూరగాయల పంటలో ఎటిఎం మోడల్ పద్ధతిలో సోమవారం వేసారు. ఈ సందర్భంగా ప్రకతి వ్యవసాయ ఇన్‌ఛార్జిలు కె.కష్ణ, కె.రాంబాబు మాట్లాడుతూ ఎటిఎం మోడల్‌లో ఒక బెడ్ వెడల్పు నాలుగడుగులు మధ్యలో ఒక అడుగు కాలువ ఏర్పాటు చేసుకొని ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న బెడ్డపై దుంప జాతి అయిన ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, కాయగూరలైన వంగ, టమోటా, బెండ, చిక్కుడు, మిరప, ఆకుకూరలు లైన తోటకూర, గోంగూర, పాలకూర, జొన్న, సజ్జ వంటి పంటలు నిర్ణీత కొలతల ప్రకారం వేసుకుంటే 365 రోజులు ప్రకతి వ్యవసాయ పద్ధతులు మంచిగా ఆచరించడం వలన నిరంతరం కూరగాయలు దిగిబడిన పొందవచ్చునని, నేలను 365 రోజులు కప్పి ఉంచవచ్చునని, ఇలా చేయడం వలన పౌష్టిక ఆహారంతో పాటు మంచి నేలలు కూడా తయారై చీడపీడల యాజమాన్యం సులువుగా చేసుకోవచ్చునని రైతులకు సూచించారు. ఈ విధంగా మోడల్స్ వేయడం వలన తక్కువ ప్రదేశంలో ఎక్కువ ఆదాయం, ఎక్కువ రకాల పంటలు పండించుకోవచ్చన్నారు.. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది, మోడల్ మేకర్ పి.సత్యన్నారాయణ, లక్ష్మి, జయమ్మ, ప్రమీల, జ్యోతి, సంతోషి, సురేష్, ధనలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లువాడ గ్రామంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది రైతులచే కోడుగుడ్డు, నిమ్మరసం ద్రావణాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా ప్రకతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ ఈ ద్రావణం పంటలలో పిచికారి చేయడం వలన మంచి నాణ్యతతో పాటుగా దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. గ్రోత్ ప్రమోటర్‌గా పంటలకు పనిచేస్తుందని తెలిపారు.

గిరిజనులకు అన్యాయం

ప్రజాశక్తి- పలాస

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనేతరులకు ఎస్‌టిల్లో చేర్చడం ద్వారా గిరిజనులకు అన్యాయం జరుగుతుందని, అటువంటి నిర్ణయాలను విరమించుకోవాలని ఆల్ ఇండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు ప్రభుత్వాలకు హితవు పలికారు. పలాస పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో పలాస జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, ఐటిఐ చదువుచున్న గిరిజన విద్యార్థినిలకు గ్రూపు వైజ్‌గా ఎక్కువ మార్కులు సాధించిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం చదువుపై దష్టి సారించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల జిల్లా జెఎసి అధ్యక్షుడు సవర రాంబాబు, ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు పెద్దింటి ఈశ్వరరావు, చంద్రశేఖర్, మోహనరావు, కాలేజీ లెక్చరర్ మధు , వార్డెన్లు గీత , భాస్కరరావు పాల్గొన్నారు

పాపారావుకు ఉత్తమ గురుకుల ఉపాధ్యాయ అవార్డు

వజ్రపుకొత్తూరు : అక్కుపల్లి మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావుకు ఉత్తమ గురుకుల ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు. గుంటూరులోని రెవెన్యూ భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సోమవారం అందించారు. విఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరింత బాధ్యతను గుర్తు చేస్తుందన్నారు. మరింత ఉత్సాహంతో సేవలు అందిస్తానని అన్నారు.


అవార్డు అందుకుంటున్న పాపారావు

శిష్టకరణ సంఘ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని శిష్టకరణ సామాజిక తరగతి అభివృద్ధి అన్ని విధాలా సహకారం అందిస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియ విజయా, నియోజకవర్గంలో పిరియా సాయిరాజ్ తెలిపారు. ఇచ్ఛాపురం పట్టణంలోని సంఘం సమావేశాలకు సరైన స్థలం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందిగాం కోటేశ్వరరావు, కళ్లేపల్లి శ్రీనివాసరావులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఆర్థిక, సామాజికంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 150 కుంటుంబాల వరకు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రకాశరావు పట్నాయక్, సదాశివుని శ్రీనివాసరావు, కె.ప్రసాద్, రమేష్, మణి, దుర్గాప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పుస్తక పఠనం ద్వారానే జ్ఞానం పెంపొందించుకోవచ్చునని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ అవరణలో ఉన్న విశాలాంధ్ర పుస్తక సంచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో కూడా విశాలాంధ్ర వారు గడిచిన, ప్రస్తుత సంఘటనలకు సంబంధించిన కథలు, స్టోరీలను ముద్రించి ఈ వాహనాలు ద్వారా మన ముందుకు తీసుకువస్తున్నారని ఇది మనకు వరం లాంటిదని వారు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైస్ ఎంపిపి దుక్క రోజారామక్రిష్ణ, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఎంపిటిసి కె.శ్రీనివాస్‌రెడ్డి, పేడాడ వెంకటరావు, సింగుపురం వినోద్, బెలమర మహేష్ ఉన్నారు.

నేటి నుంచి ఎఫ్‌ఎ -2 పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

విద్యాసంవత్సరం ఆకడమిక్ క్యాలండర్ ప్రకారం మంగళవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్‌ఎ-2 పరీక్షలు జరగనున్నాయి. సమగ్ర శిక్షా ఆభయాన్ ఆధ్వర్యంలో జిల్లాపరీక్షల విభాగం నుంచి వాట్స్‌ఆప్ ద్వారా ప్రశ్నాపత్రాలు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చేరవేయబడతాయి. దీని ఆధారంగా ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రాన్ని నల్లబల్ల మీద రాసి విద్యార్థులచే పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక పాఠశాలలకు ఉదయం పూట పరీక్షలు నిర్వహణ జరగనుంది. ఉన్నత పాఠశాలల్లో రెండు పూటలా పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9, 10 తరగతులకు కలిపి ఒకపూటలో రెండు పరీక్షలు జరగనుండగా ఆరవతరగతి నుంచి 8వతరగతి వరకు రెండవ పూట రెండు పరీక్షలు నిర్వహించేలా కాల నిర్ణయపట్టిక విద్యార్థులకు అందించారు. పరీక్షలు రాత విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి కాల నిర్ణయపట్టిక విద్యార్థులకు అందివ్వడం జరిగింది. దసరా సెలవుల ముందు ఎఫ్‌ఎ-2 పరీక్షలు నిర్వహించగా సెలవుల ఆనంతరం ఆర్ధ సంవత్సరిక పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది.

జిపిఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ ఆమోదించిన జిపిఎస్ బిల్లును వ్యతిరేకిస్తూ టిడిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పొందూరు మండలం తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మహాత్మగాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, సిపియస్ స్థానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన జీపిఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని, ఎన్‌సిఇఆర్‌టి, ఐబి సిలబస్‌లను బలవంతంగా విద్యార్థులపై రుద్దడం సరికాదంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, విజయనగరం జిల్లా అధ్యక్షులు కొమ్ము అప్పలరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.గోపాలరావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సన్యాసిరావు, శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు జి.భాస్కరరావు, పొందూరు మండల బాధ్యులు గండెం రామారావు, విభీషణరావు, గున్నంనాయుడు, సీపాన భాస్కరరావు, జి.వెంకటరావు, జగదీష్, పాల్గొన్నారు.